www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 28 జనవరి 2024

5

పశ్చిమ గోదావరి

డెంగీతో యువకుడు మృతి

సాయిచంద్ (ఫైల్)

ఆచంట :డెంగీ జ్వరంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి యువకుడు మృతి చెందాడు. మండలంలోని ఆచంట గ్రామానికి చెందిన సజ్జ ఏసు కుమారుడు సజ్జ శ్రీకాంత్(29)కు ఐదు రోజుల క్రితం జ్వరం రావడంతో పాలకొల్లు సౌమ్య హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. మెరుగైన చికిత్స నిమిత్తం మూడు రోజుల క్రితం అక్కడి నుంచి రాజమండ్రి బొల్లినేని హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ శ్రీకాంత్‌కు డెంగీ అని వైద్యులు నిర్ధారించారని, అప్పటినుంచి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడని ఎంపిటిసి సభ్యులు తమ్మినీడి పృధ్వీకుమార్ తెలిపారు. శ్రీకాంత్ మృతితో ఆచంటలో విషాద చాయలు అలుముకున్నాయి. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన శ్రీకాంత్ ప్రస్తుతం వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. ఆచంటలో దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో తరచూ ప్రజలు జ్వరాలు బారిన పడుతున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపిటిసి సభ్యులు పృధ్వీకుమార్ కోరారు.



పోలీసులకు.. పంగనామం..!

ఏడాదిన్నరగా టిఎ, సరెండర్ లీవుల సొమ్ము పెండింగ్

ఒక్కో పోలీస్ ఉద్యోగికి తక్కువగా లెక్కించినా రూ.లక్షన్నర బకాయి

జిపిఎఫ్, భద్రతా రుణాల మంజూరులోనూ నిరాశే

వీక్లీఆఫ్‌ను కాగితాలకే పరిమితం చేసిన వైసిపి సర్కార్

రెండు జిల్లాల్లోనూ మూడు వేల మంది పోలీస్ సిబ్బంది అవస్థలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గతంలో ఏ ప్రభుత్వమూ తమను ఇంతగా మోసం చేయలేదంటూ పోలీస్ సిబ్బంది నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులను ప్రయివేటు సైన్యంలా వాడుకుంటున్న వైసిపి సర్కార్ టిఎ, సరెండర్ లీవుల సొమ్ము వంటివి సైతం ఇవ్వకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జిపిఎఫ్, భద్రతా రుణాల మంజూరులోనూ తీవ్ర నిరాశే పోలీసులకు మిగిలింది. వీక్లీఆఫ్ సైతం కాగితాలకే పరిమితమవ్వడంతో తమకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ పోలీసుల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. ఏ పోలీస్ సిబ్బందిని కదిపినా ఇదే చర్చ సాగుతోంది.

పోలీసులను ప్రజలపై ఉసిగొల్పుతూ ఓ ప్రయివేటు సైన్యంలా వాడుకుంటున్న వైసిపి సర్కార్ వారికి ఇవ్వాల్సిన ఆర్థిక విషయాల్లో మాత్రం పంగనామాలు పెట్టిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం తమను తీవ్రంగా వంచించిందనే భావన పోలీసులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కానిస్టేబుల్ నుంచి పైస్థాయి వరకూ మూడు వేల మందికిపైగా పోలీసులు పని చేస్తున్నారు. ఏ పోలీస్‌ను కలిసినా తమ బాధను చెప్పుకునే పరిస్థితి ఉంది. తమకు రావాల్సిన టిఎ, సరెండర్ లీవ్స్ సొమ్ము ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులు పెడుతుందని తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. పోలీసులు సిఎం, విఐపి బందోబస్తులతోపాటు, వేరే ప్రాంతాల్లో విధులు నిర్వర్తించినందుకుగాను టిఎ (రవాణా ఖర్చు) నెలకు రూ.2,100 ఇవ్వాల్సి ఉంటుంది. ఈ సొమ్ము ఏమాత్రం సరిపోదు. రాజధాని ప్రాంతంలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి రోజుకు భోజనంతోపాటు, ఇతర ఖర్చుల రూపంలో తడిసిమోపెడవుతున్నా సర్దుకుపోతున్న పరిస్థితి ఉంది. వైసిపి సర్కార్ వచ్చిన తర్వాత పోలీసులకు ఇవ్వాల్సిన టిఎ బిల్లుల చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతుందని చెబుతున్నారు. దాదాపు ఏడాదిన్నరగా పోలీస్ సిబ్బందికి ఇవ్వాల్సిన టిఎ బిల్లుల సొమ్ము పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులకు 24 గంటల విధి నిర్వహణ ఉంటుంది. అందుకుగాను సరెండర్ లీవ్స్ కింద ఏడాదికి ఉద్యోగి అనుభవాన్ని బట్టి రూ.20 వేల నుంచి రూ.40 వేలకుపైగా ఇవ్వాల్సి ఉంది. ఈ సొమ్ము ఏడాదికి మూడు విడతలుగా జనవరి, జులై, నవంబర్‌లో చెల్లిస్తారు. ఈ సొమ్ముతోనే పోలీస్ సిబ్బంది తమ పిల్లల స్కూల్ ఫీజులు విడతలవారీగా చెల్లిస్తూ ఉంటారు. సరెండర్ లీవ్స్‌కు సంబంధించిన బకాయిలు 2022లో ఒక విడత రావాల్సి ఉండగా, 2023కు సంబంధించి మూడు విడతల్లో ఒక్కటీ కూడా ఇవ్వలేదు. మొత్తం నాలుగు విడతలకు సంబంధించిన సరెండర్ లీవ్స్ సొమ్ము బకాయిలు పోలీస్ సిబ్బందికి ఇవ్వాల్సి ఉందని చెబుతున్నారు. ఒక్కో ఉద్యోగికి తక్కువగా లెక్కించినా రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకూ టిఎ, సరెండర్ లీవ్స్, ఇతర బకాయిలు ఉన్నట్లు చెబుతున్నారు. కానిస్టేబుల్ ఉద్యోగం చేసేవారికి ఇది చాలా పెద్దమొత్తంగా చెప్పొచ్చు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్న పోలీసులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సానుభూతీ లేకుండాపోయిందనే చర్చ నడుస్తోంది.

కాగితాల్లోనే వీక్లీ ఆఫ్

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పోలీసులకు వీక్లీ ఆఫ్ (వారాంతపు సెలవు) అమలు చేస్తామని వైసిపి హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడ్డాక వీక్లీఆఫ్ అమలుపై ఆదేశాలు సైతం ఇచ్చి ఇదీ తమ ప్రభుత్వ చిత్తశుద్ధి అంటూ గొప్పలు చెప్పింది. అయితే వీక్లీఆఫ్ అనేది మూన్నాళ్ల ముచ్చటగా మారిపోయింది. రెండు, మూడునెలలు కూడా కొనసాగని పరిస్థితి. వీక్లీఆఫ్ అనేది కాగితాలకే పరిమితం కావడంతో పోలీసులకు సెలవు అనేది లేకుండా పోయింది. ఉద్యోగులకు సంబంధించిన పిల్లల వివాహాలు, ఇతర ఆపదల సమయంలో అండగా నిలిచే జిపిఎఫ్‌కు సంబంధించిన సొమ్ము సైతం దరఖాస్తులు చేసుకున్నా అందని పరిస్థితి. ఇంటి నిర్మాణం వంటి వాటి కోసం ఇచ్చే భద్రతా రుణాల మంజూరులో తీవ్ర నిరాశే పోలీసులకు మిగిలింది. ఇలా అనేక సమస్యలతో పోలీసులు సతమతమవుతున్నారు. దీంతో ప్రభుత్వంపై పోలీస్ కుటుంబాలు తీవ్ర ఆగ్రహంగా ఉన్న పరిస్థితి కన్పిస్తోంది. తమకు సమ్మె చేసే హక్కు లేదని, ఉంటే తాము కూడా రోడ్డెక్కి ఆందోళన చేసేవాళ్లమని పలువురు వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం. పోలీసుల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు జనాల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలీక పోలీస్ సిబ్బంది మౌనంగా రోదిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందైనా తమకు ఇవ్వాల్సిన బకాయిలు విడుదల చేయాలని వారంతా కోరుతున్నారు.

మళ్లీ వైసిపి వస్తేనే పథకాల కొనసాగింపు

వైఎస్ఆర్ ఆసరా భారీ బహిరంగ సభలో డిప్యూటీ సిఎం కొట్టు



డ్వాక్రా మహిళలకు నమూనా చెక్కు అందిస్తున్న మంత్రి కొట్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రంలో మళ్లీ వైసిపి ప్రభుత్వం వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, అందరికీ మంచి జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెంలో వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత సంబరాలు శనివారం మదర్ వన్నీని ఆసుపత్రి ఎదురుగా ఉన్న మున్సిపల్ పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు తాడేపల్లిగూడెం టౌన్, రూరల్, పెంటపాడు మండలాల్లోని అన్ని గ్రామాల నుంచి మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ డ్వాక్రా మహిళల పట్ల వైసిపి ప్రభుత్వానికి, సిఎం జగన్‌కు చిత్తశుద్ధి ఉందన్నారు. జగనన్న సంక్షేమ పథకాల ఆర్థిక లబ్ధిని నేరుగా మహిళల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. అమ్మ ఒడి, వైఎస్ఆర్ ఆసరా, చేయూత, కాపునేస్తం, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన ఇలా అనేక సంక్షేమ పథకాల ఆర్థిక లబ్ధి మొత్తాన్ని సిఎం జగన్ మహిళల ఖాతాల్లో నేరుగా జమ చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే ఈ పథకాలన్నీ అమలవుతాయన్నారు. వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత సందర్భంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని 3939 స్వయం సహాయక సంఘాలకు చెందిన 37,773 మంది మహిళలకు లబ్ధి చేకూరుస్తూ డ్వాక్రా రుణమాఫీ కింద రూ.33 కోట్ల చెక్కును మహిళా సంఘాలకు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, జెడ్‌పిటిసి సభ్యులు ముత్యాల ఆంజనేయులు, ఆర్‌డిఒ కె.చెన్నయ్య, ఎఎంసి ఛైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కర్రి భాస్కరరావు, పెంటపాడు ఎంపిపి దాసరి హైమావతి, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వార్డు ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

నరసాపురం :భవిష్యత్తులో డ్వాక్రా స్వయం సహాయక సంఘాలు మరింత బలోపేతం కావాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం మున్సిపాలిటీ పరిధిలో మహిళలకు సంబంధించిన వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ పట్టణంలోని కాటన్ పార్కులో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పట్టణంలో 14 వార్డులకు సంబంధించిన 635 స్వయం సహాయక సంఘాలు 6,350 మంది మహిళలకు రూ.5.67 కోట్ల విలువైన నమూనా చెక్కును స్వయం సహాయక సంఘాల గ్రూపులకు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకటరమణ, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమని నాగరాజు, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కామన నాగిని పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు చర్యలు

జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

పేదలకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పక్రియను చేపట్టేందుకు ముందస్తు చర్యలు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్స్‌పై సంబంధిత అధికారులతో శనివారం సమీక్షించారు. జిల్లాలో అర్హత కలిగిన 76 వేల పట్టాదారులు ఉన్నారని, 62 వేలు మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన 14 వేలు మ్యాపింగ్ ప్రక్రియపై దృష్టి సారించాలని సూచించారు. ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పర్యవేక్షణకు నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ నాగార్జున, సూపరింటెండెంట్ రాంబాబు, ఐటీ ప్రతినిధి భార్గవ్ పాల్గొన్నారు.

నేడు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్-2024

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఛాంబర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్- 2024ను పాలకొల్లుకు చెందిన ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మెరిట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచినవారికి రూ.3 లక్షల విలువైన ప్రోత్సాహకాలు, ఫీజు రాయితీలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి, హెచ్‌ఇసి చదివే సీని యర్ ఇంటర్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్విని యో గం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 98497 12739, 9701394660 సంప్రదించాలని తెలిపారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జోనల్ ఛైర్మన్ మహేష్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జోనల్ ఛైర్మన్ పెన్నెంటి మహేష్ శనివారం తాడేపల్లిగూడెం డిపోను సందర్శించి ఆవరణలో మొక్కలను నాటి, డిపోలో అన్ని విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.వీరయ్యచౌదరి, డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి సురేష్, గ్యారేజ్ సూపర్‌వైజర్లు రమణ చిట్టిబాబు, ఆఫీస్ సూపరింటెండెంట్ భీమయ్య పాల్గొన్నారు.

నష్టం కలగకుండా ఆక్వా రంగానికి ఇన్సూరెన్స్

బీమాపై సమన్వయ సమావేశంలో అప్సడ రాష్ట్ర వైస్ ఛైర్మన్ వడ్డే రఘురాం

పలు సందేహాలు వ్యక్తం చేసిన రైతులు

రొయ్యల పంటల బీమాపై సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే రఘురాం

ప్రజాశక్తి - వీరవాసరం

ఆక్వా రంగంలో రొయ్యల సాగుకు ఇన్సూరెన్స్ ద్వారా నష్టం కలిగించే ఏ విధమైన చర్యలను తీసుకోబోమని ఆంధ్రప్రదేశ్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారటీ (అప్సడ) రాష్ట్ర వైస్ ఛైర్మన్ వడ్డే రఘురాం తెలిపారు. రొయ్యల పంటల బీమాపై సమన్వయ సమావేశాన్ని శనివారం తులసీ కన్వెన్షనలో నిర్వహించారు. ఉభయ పశ్చిమ గోదావరి, కృష్ణా, తూర్పుగోదావరి జిల్లా రొయ్య రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రఘురాం హాజరై మాట్లాడారు. గత 15 ఏళ్లుగా ఆక్వా రంగానికి మద్దతుగా ఏ బీమా సంస్థలు ముందుకు రాలేదన్నారు. ప్రస్తుతానికి కొన్ని కంపెనీలు ఆక్వా సాగుకు బీమా కల్పించేందుకు ముందుకు రావడంతో ఆయా సంస్థలతో ప్రభుత్వం సంప్రదింపులు జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మరికొన్ని రాష్ట్రాలను పైలెట్ ప్రాజెక్టుగా కేంద్రం ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో కొంత మంది రైతులకు ఉచితంగా బీమాను వర్తింపచేసి అందులోని లోటుపాట్లును గమనించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రమేయంతో రైతులకు ఏ విధమైన నష్టం కలిగించని రీతిలో బీమా నిబంధనలు ఉంటాయని భరోసా ఇచ్చారు. బీమా సంస్థల నిబంధనలు, రైతుల అభిప్రాయాలు పూర్తిస్థాయిలో చర్చించి నిబంధలను రూపొందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు ఉపయోగకరంగా ఉంటేనే బీమా సంస్థలకు అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా రైతులు వ్యక్తపరిచిన పలు అభిప్రాయాలకు బీమా సంస్థలు ప్రతినిధులు నివృతం చేశారు. దాదాపు 80 శాతం నష్టాలను మిగిల్చే రొయ్యల సాగుకు బీమా కల్పించేందుకు ఆ సంస్థలు ముందుకు రావడం పట్ల ఎంతమేరకు రైతులకు మేలు జరుగుతుందో వేచి చూడాల్సి ఉందంటూ పలువురు రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. తొలుత రైతుల నుంచి బీమా ప్రీమియం కట్టించుకుని ఆ తరువాత సవాలక్ష నిబంధనలతో నష్టపోయిన రైతులకు బీమా వర్తింపచేయడంలో సంబంధిత బీమా సంస్థలు తప్పించుకునే ధోరణి అవలం భిస్తాయనే సందేహాలను రైతులు బహిరంగంగానే చెబుతున్నారు. అప్సడ రాష్ట్ర వైస్ ఛైర్మన్ రఘురాంకు క్యాబినెట్ హోదా కల్పించడంతో ఆయనను సత్కరించారు. భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిబాబును సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో రొయ్య రైతుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జికె.సుబ్బరాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మళ్ల రాంబాబు, రొయ్య రైతుల సంఘం నాయకులు యరకరాజు గోపాలకృష్ణంరాజు, వీరవల్లి చంద్రశేఖర్, భోగిరెడ్డి శ్రీనివాసరావు, మత్స్యశాఖాధికారులు, బీమా సంస్థల ప్రతినిధులు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వం 'ఆరోగ్యశ్రీ' బిల్లులు చెల్లించాలి

సేవలు నిలిపివేస్తామని ఆసుపత్రి యాజమాన్యాలు ప్రకటించడం ఆందోళనకరం

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - యలమంచిలి

ప్రభుత్వం వందల కోట్ల రూపాయల మేర ఆరోగ్యశ్రీ సేవలందిస్తున్న ఆసుపత్రులకు బకాయి పడ్డ నేపథ్యంలో ఇక ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తున్నట్లు యాజమాన్యాలు ప్రకటించడం చాలా ఆందోళన కలిగించే విషయమని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని చించినాడ అమరవీరుల స్మారక భవనంలో సిపిఎం మండల కమిటీ సమావేశం జిల్లా కమిటీ సభ్యులు బాతిరెడ్డి జార్జి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలందరికీ చాలా గొప్పగా ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్నామని, బిల్లు రూ.వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తున్నామని, రూ.రెండు లక్షల ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల వరకు పెంచామని ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నప్పటికీ కొన్నింటికి మాత్రమే ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తున్నారన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు ఆరోగ్యశ్రీలో లేకపోవడంతో ఈ రోగాల బారిన పడిన పేదలు రూ.లక్షలు అప్పులు చేసి ఆసుపత్రుల్లో బిల్లులు చెల్లించే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అన్ని రోగాలను ఆరోగ్యశ్రీలో చేర్చి ఆరోగ్యశ్రీ సేవలందిస్తున్న యాజమాన్యాలకు బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, మండల కార్యదర్శి బాలరాజు, సిపిఎం సీనియర్ నాయకులు కేతా సూర్యారావు, మాసవరపు సుబ్బారావు, దేవ సుధాకర్, మండల కమిటీ సభ్యులు జిల్లెల్ల ప్రశాంతి, జి.ఆంజనేయులు, శ్రీరాములు, మోహన్‌రావు పాల్గొన్నారు.

తామర చెరువును పరిరక్షించాలి

కలెక్టరేట్ వరకు పెన్నాడ గ్రామస్తుల ర్యాలీ

కలెక్టర్ ప్రశాంతికి ఫిర్యాదు

చెరువును పరిశీలించిన ట్రెయినీ కలెక్టర్, డిపిఒ



రికార్డులు పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్, డిపిఒ

ప్రజాశక్తి - పాలకోడేరు

పెన్నాడ గ్రామంలోని తామర చెరువును అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం సర్పంచి చిల్ల అనూష అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. పంచాయతీ ఆధీనంలో ఉన్న తామరచెరువును కొందరు తమది అంటూ స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని, నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం భీమవరం కలెక్టరేట్ వరకు గ్రామస్తులు ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ట్రెయినీ కలెక్టర్ కానాల సంగీత్‌మాధుర్, జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి మల్లికార్జునరావులు, తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఆర్ఐ నాగభూషణం నాయుడు, పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మి, సర్పంచి చిల్లా అనూషలతో కలిసి తామరచెరువు ప్రాంతాన్ని సాయంత్రం పరిశీలించారు. ఈ తామరచెరువుకు సంబంధించిన రెవెన్యూ, పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. పరిశీలించిన అంశాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందిస్తామన్నారు. అనంతరం స్థానిక సచివాలయంలో స్థానిక అధికారులతో సమావేశమయ్యారు. వారితో పాటు విఆర్ఒలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, సర్వేయర్ రాజేష్ ఉన్నారు.

పనులు నిలుపుదల చేయిస్తాం : డిపిఒ

కోర్టు పరిధిలో ఉన్న పెన్నాడ తామరచెరువులో కొందరు ప్రవేశించి నీటిని బయటికి తోడే పనులు చేపట్టారని డిపిఒ మల్లికార్జునరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు తామరచెరువు ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. ఈ చెరువు ప్రాంతంలో చేపట్టిన పనులను పోలీస్ ప్రొటెక్షన్‌తో నిలుపుదల చేయిస్తామని తెలిపారు. తామరచెరువు పరిరక్షణకు పంచాయతీ, రెవెన్యూ స్థానిక సర్పంచి పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. చెరువు ప్రాంతంలో జరుగుతున్న పనులను నిలుపుదల చేస్తామని తెలిపారు.

ఊరడింపు పలుకులు..!

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాల జాతర

ఓవైపు గణతంత్ర వేడుకలు.. మరోవైపు మాకిచ్చిన హామీల సంగతేమిటంటూ రైతులు, కార్మికులు రోడ్డెక్కి నినాదాలు వెరసి జిల్లాలో నెలకొన్న పలు సమస్యలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. అయితే ఎన్నికల వేళ ఊరడింపు మాటలు.. శంకుస్థాపనల హడావుడి పెరగడంతో మాటలేనా.. చేతలేమైనా ఉంటాయా అని జనం చర్చించుకుంటున్నారు.

గణతంత్ర వేడుకల్లో గవర్నర్ తన ప్రసంగంలో పోలవరం ప్రాజెక్టుతోపాటే పునరావాసం అని ప్రకటించడం నిర్వాసితుల్లో చర్చనీయాంశమైంది. పరిహారం దక్కక, పునరావాస కాలనీల్లో వసతుల్లేక నిర్వాసితులు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓపక్క పరిహారం ఇవ్వకుండానే ప్రాజెక్టు పనులు చేపట్టడం, గేట్లు అమర్చడంతో బ్యాక్ వాటర్ ఎగదన్ని గోదావరికి స్వల్ప వరదొచ్చి కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గ్రామాలు నీట మునుగుతున్నాయి. జూన్ నుంచి సెప్టెంబర్ నెల వరకూ నాలుగు నెలలపాటు అక్కడి ప్రజలు ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. పరిహారం ఇస్తే తాము పునరావాస కాలనీలకు వెళ్లిపోతామని నిర్వాసితుల నోటిమాటగా మారిందంటే వరదలకు వాళ్లెంత భయభ్రాంతులకు గురవుతున్నారో అర్థమవుతోంది. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం ప్రక్రియ పూర్తి చేశాకే ప్రాజెక్టు పనులు చేపట్టాలని సిపిఎం, ఎపి గిరిజన సంఘం, నిర్వాసితుల సంఘం చాలాకాలంగా డిమాండ్ చేస్తూ వివిధ రూపాల్లో ఆందోళనలు సైతం నిర్వహిస్తున్నాయి. సిఎం నిర్వాసిత గ్రామానికి వస్తే ఆ గ్రామ, చుట్టుపక్కల గ్రామాల్లోని కొందరు నిర్వాసితులకే పరిహారం జమవుతుండటం సర్వసాధారణంగా మారింది. దీంతో మిగిలిన గ్రామాల నిర్వాసితులు తీవ్ర నిరాశ, ఆవేదనకు గురవుతున్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం, ప్రస్తుతం జగన్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టులపై సారించిన దృష్టి నిర్వాసితులపై కేంద్రీకరించిన దాఖలాల్లేవు. కనీసం ఇప్పటికైనా గవర్నర్ ప్రాజెక్టుతోపాటే పునరావాసం అని చెప్పడం కొంత ఊరడింపేనని నిర్వాసితులు చెబుతున్నారు. అయితే పునరావాసం పూర్తయ్యాకే ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే పునరావాస కాలనీల్లో వసతుల కల్పనపైనా దృష్టి సారించాలని కోరుతున్నారు. అయితే ఇది ఎన్నికల ముందు ఊరడింపు ప్రకటనగా మిగులుతుందో.. లేదో వాస్తవమో కార్యాచరణే తేల్చాల్సి ఉంది.

ఢిల్లీ రైతు ఉద్యమ సందర్భంగా ఇచ్చిన హామీల సంగతేమిటంటూ సంయుక్త కిసాన్ మోర్చా-కార్మికసంఘాల ఆధ్వర్యాన రైతులు, కార్మికులు జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన ర్యాలీలు చర్చనీయాంశమయ్యాయి. ఓవైపు నిత్యావసరాల ధరలు



ఆకాశాన్నంటుతున్న తరుణంలో అందరికీ అన్నంపెట్టే అన్నదాత తాను పండించిన పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాలని రోడ్డెక్కాల్సి రావడం విచిత్రకరమైన పరిస్థితి అని అంతా వ్యాఖ్యానించడం గమనార్హం. రైతే లేకపోతే నోట్లోకి ముద్ద ఎలా వెళ్తోందని, వ్యవసాయంపై ఆధారపడే వివిధ తరగతుల ప్రజల జీవనమే ప్రశ్నార్థకమవుతోందని గుర్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికల వేళ రానున్న కేంద్ర బడ్జెట్‌లో ఇచ్చిన హామీల అమలుకు కార్యాచరణ ప్రకటిస్తుందో.. లేదో వేచిచూడాలి.

ఏలూరు జిల్లా దెందులూరు మండలం దోసపాడులో పేదలు, దళితులు తమ అసైన్డ్ భూములు తమకు ఇప్పించాలని ఏళ్ల తరబడి సాగిస్తున్న పోరును మళ్లీ ఉధృతం చేశారు. ఈ సమస్యను పరిష్కరించాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తుండగా పోలీసు యంత్రాంగం చట్టం పేదలకు ఒకలా, భూముల ఆక్రమణదారులకు మరోలా అమలు చేస్తూ అపహాస్యం పాలవుతున్నారు. భూముల్లోకి వెళ్లొద్దని పేదలను అడ్డుకుంటున్న పోలీసులు మరి ఆక్రమణదారులు చెరువులో చేపలు పట్టుకుని వెళ్లిపోతున్నా కనీసం ప్రశ్నించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రరూపం దాల్చుతుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

పిసిసి అధ్యక్షురాలి హోదాలో షర్మిల ఏలూరులో పర్యటించారు. నేతల హాజరు బాగున్నా కార్యకర్తల సమీకరణలో వెనుకబాటు ఈ సమావేశంలో స్పష్టంగా కన్పించింది. ప్రధానంగా రెండు జిల్లాలను నడిపించే నేతలకు బాధ్యతలు అప్పగించకపోవడం, ఎన్నికల్లో పోటీపై స్పష్టత ఇవ్వకపోవడంతో నేతలే హాజరయ్యారు తప్ప కార్యకర్తలు ఈ సమావేశానికి దూరంగా ఉన్నారనేది స్పష్టమవుతోంది. ఏదేమైనా షర్మిల తనదైన శైలిలో బిజెపి, వైసిపి, టిడిపిలపై విమర్శలు ఎక్కుపెట్టడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో అధికారపక్షం, ప్రతిపక్షం తేడా లేకుండా అంతా బిజెపి ముందు సాగిలపడుతున్నారని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరు ప్రమాదకరమని సిపిఎం ఎప్పటి నుంచో హెచ్చరిస్తోంది. తాము అధికారంలోకొస్తే ప్రత్యేక హోదా కాంగ్రెస్ ఇస్తుందని ప్రకటించడమూ చర్చనీయాంశమైంది. అయితే ఈ అంశాలన్నీ రానున్న ఎన్నికల్లో ఏ మేరకు ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.

ఇక జిల్లాలో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపనల జాతర ప్రారంభమైంది. ఎంఎల్ఎలు శంకుస్థాపనలతోపాటు అభివృద్ధి పనులను హడావుడిగా పూర్తి చేయించి ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. పనిలో పనిగా ప్రజా సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమంటూ ఎన్నికల ప్రచార శంఖారావం పూరించేస్తున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

పాఠశాలకు ఫ్యాన్లు బహూకరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మండల ప్రజా పరిషత్తు ప్రాథమిక పాఠశాల లంకలకోడేరు-2కు ప్రముఖ పారిశ్రామికవేత్త లయన్స్ జిల్లా లిటరసీ డైరెక్టర్ పిఎస్ డి వి ప్రసాద్ సౌజన్యంతో నాలుగు ఫ్యాన్లు బహూకరించారు. వీటిని పాఠశాల హెచ్‌ఎం గుత్తుల శ్రీనివాస్‌కు శనివారం అందించారు. ఈ సందర్భంగా పాలకొల్లులో దాత ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, దాతల సహకారం వినియోగించుకుని విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలన్నారు. భవిష్యత్తులో పాఠశాలకు ఏఅవసరమొచ్చినా తన సహకారం ఉంటుందని చెప్పారు. దాత ప్రసాద్‌ను వైస్ ఎంపిపి నాగేశ్వరరావు, కర్ణి జోగయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్, విద్యా శాఖ మండల కో-ఆర్డినేటర్ తోకల జనార్ధన్ పాల్గొన్నారు.

నాగేశ్వరరావుకు ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు


పురస్కారం అందుకుంటున్న నాగేశ్వరరావు

పాలకొల్లు విద్యుత్ శాఖ రూరల్ ఎడిఇ నాగేశ్వరరావు జిల్లా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈ మేరకు ఎపిడిసిఎల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సాల్మన్‌రాజు నుంచి ఉత్తమ సేవా పురస్కారాన్ని శనివారం ఏలూరులో అందుకున్నారు. గతేడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కూడా జిల్లా కలెక్టర్ ప్రశాంతి నుంచి జిల్లా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావును వివిధ పార్టీల నేతలు, తోటి విద్యుత్ శాఖాధికారులు అభినందించారు.

విల్సన్‌బాబుకు ఉత్తమ సిహెచ్‌ఒ అవార్డు

గణపవరం : గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా ప్రజలకు వైద్య సేవలందించిన జాలాది విల్సన్‌బాబుకు ఉత్తమ సిహెచ్‌ఒ అవార్డును జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అందించారు. ఈ సందర్భంగా విల్సన్‌బాబు మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రజలకు వైద్య సేవలందించడంలో మరింత కృషి చేస్తానని చెప్పారు. అవార్డు విల్సన్‌బాబును ఆసుపత్రి డాక్టర్ పి.సంతోష్‌నాయుడు, ఆరోగ్య కార్యకర్తలు జి.శ్రీను, ఎ.కృష్ణ, ఎం.యోహాను, ఎం.నల్లయ్య అభినందించారు.

కనకరత్నమాలకు అవార్డు

ఆచంట : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమలాపురం గ్రామానికి చెందిన ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు కొత్త కనకరత్నమాల వెంకటేశ్వర్లు అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. 1983 నుంచి 2024 వరకు సుమారు 40 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రత్నమాలను తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ తహశీల్దార్ సంధ్య, ఆర్‌ఐ జయలలిత అభినందించారు.

నేడు ల్యాండ్ టైటిల్ యాక్ట్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌పై ఆదివారం శృంగవృక్షం ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో భీమవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్లు శృంగవృక్షం గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గులిపల్లి సత్యనారాయణ, సోము రామకృష్ణ తెలిపారు. ఈ చట్టం వల్ల ప్రజలకు కలిగే నష్టాల గురించి వివరించేందుకు బార్ అసోసియేషన్ అధ్యక్షులు మొగళ్ల వెంకట రమణారావు, ఇతర న్యాయవాదులు హాజరు కానున్నట్లు తెలిపారు.

వల్లూరులో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం

ఆచంట : ఇంటింటికి తాగునీరు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు అన్నారు. జలజీవన్ మిషన్ పథకం నిధులు రూ.18 లక్షలు కేంద్ర ప్రభుత్వం నిధులతో వల్లూరు పంచాయతీ పరిధి రాపాకవారిపాలెంలో చేపట్టిన పనులను ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జలజీవన్ మిషన్ 2024 నాటికి దేశంలోని ప్రతి గ్రామీణ గృహానికి క్రియాత్మకమైన కుళాయిల ద్వారా మంచి నీటిని అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పనులు త్వరలోనే పూర్తి చేసి గ్రామీణ ప్రజలకు సురక్షిత మంచినీటి అందిస్తామని తెలిపారు.

డ్వాక్రా మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - ఉండి

ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉండి మండల సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మహిళ న్యాయవాదులు జి.గాయత్రి, జి.ఉమారాణి హాజరై డ్వాక్రా మహిళలకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. అక్రమ రవాణా, వ్యాపార లైంగిక దోపిడీ, గృహహింస చట్టం బాధితులకు నష్టపరిహారం తదితర వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం పిఎల్‌వి పాలూరు బాలాజీ మాట్లాడుతూ మానవజాతి అభివృద్ధిలో స్త్రీ మూర్తి కీలకమైనదన్నారు.

ఆకట్టుకున్న కోలాట నృత్య ప్రదర్శన

కాళ్ల : మండలంలోని కాళ్లకూరులో వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం కోలాట నృత్య ప్రదర్శన నిర్వహించారు. చినఅమిరం పద్మావతి వెంకటేశ్వర ట్రస్ట్ వారి కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. శనివారం కావడంతో పెద్ద ఎత్తున యాత్రికులు వచ్చారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్‌కుమార్, సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు నుంచి అయిభీమవరం వెళ్లే రోడ్డులో మూడు తూముల వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానిక ఇల్లాపువారివీధికి చెందిన నడిపల్లి సాయిచంద్ (25) అయిభీమవరం మలుపులో ఉన్న కార్తికేయ కాలేజీ ఎదురుగా మోటార్‌మెకానిక్ షెడ్ నడుపుకుంటున్నాడు. ఈ క్రమంలో శనివారం షెడ్డు తీసేందుకు బైక్‌పై వస్తుండగా బొలెరో వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయిచంద్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆకివీడు ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం

కుమారుడి మృతితో తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతంగా మారింది. విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులు బోరున విలపించారు. మృతుడి తల్లిదండ్రులు సిద్దయ్య, సుజాతలకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె వివాహం చేశారు. మరో వారం రోజుల్లో సాయిచంద్ వివాహం స్థిరపరచుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఈ స్థితిలో కుమారుని మృతితో తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతంగా మారింది.

జిల్లాను మరింత అభివృద్ధి చేయాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

చిన్నారులతో కలెక్టర్, ఎస్పి, జెసి

75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్థానిక జిల్లా కలెక్టర్ బంగ్లా ప్రాంగణంలో శుక్రవారం రాత్రి ఎట్ హోమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎస్పి యు.రవిప్రకాష్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి, సెబ్ అడిషనల్ ఎస్పి ఎటివి.రవికుమార్, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుతఅంబరీష్, కె.చెన్నయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, అన్ని శాఖల జిల్లా అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన తేనీటి విందును స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారుల సమన్వయం, కృషి ఫలితంగా జిల్లా సుసంపన్నంగా ఉందన్నారు. జిల్లాలో అన్ని రంగాల్లో అన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. భవిష్యత్తులో జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తారని ఆకాంక్షిస్తున్నామన్నారు. రాష్ట్రంలో జిల్లాకు అభివృద్ధిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని అధికారులను కోరారు. అనంతరం నిర్వహించిన వీణవాయిద్యం, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ ప్రశాంతి వారిని అభినందించి జ్ఞాపికలను బహూకరించారు. అధికారులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు ప్రత్యేక బహుమతులను అందించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు ప్రధాన సమన్వయకర్తగా తహశీల్దార్ వై.దుర్గాకిషోర్ వ్యవహరించారు.

సర్పంచి మునేశ్వరరావుకు సతీవియోగం

ప్రజాశక్తి - మొగల్తూరు

శేరేపాలెం గ్రామ సర్పంచి తణుకుల మునేశ్వరరావుకు సతీవియోగం కలిగింది. ఆయన సతీమణి రామ పద్మ కనకదుర్గ (54) అనారోగ్యంతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందారు. వారికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్తకు ఎంతో చేదోడు వాదోడుగా ఉండే కనకదుర్గ మృతి చెందడంతో శేరేపాలెం గ్రామస్తులు, రైతులు, ఆమె కుటుంబసభ్యులు విషాదానికి లోనయ్యారు. మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొగల్తూరులోని సిఐటియు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్న విఒఎలకు వర్తింపజేసే కాల పరిమితి జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఆర్‌సి పాలసీ ప్రకారం ప్రమోషన్ ఇవ్వాలని, వారికి కార్మిక చట్టాలు వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ, వాటాల వెంకటలక్ష్మి, మేళం అంజలి, యడ్లపల్లి పద్మ, దుర్గ, డి.దేవి, డి.పార్వతి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన క్రొవిడిలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని నిడమర్రు ఎంపిపి ధనకొండ ఆదిలక్ష్మి ప్రారంభించారు. వంద మందికి ఉచితంగా కంటి నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు రావూరి నాగరాజు, కాకర్ల వినాయక, కెఎన్.విశారద, బూసాల బాలాజీ, వాసిరెడ్డి భాస్కర్, కంటి వైద్యులు కె.హరినాథ్‌రెడ్డి, ప్రకాష్ పాల్గొన్నారు.

నేడు 'మన ఓటు.. మన భవిష్యత్తు'

ప్రజాశక్తి - కాళ్ల

పెద అమిరంలోని నిర్మలాదేవి ఫంక్షన్ హాలులో ఆదివారం మన ఓటు.. మన భవిష్యత్తు.. మన బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నంబూరి వెంకటరామరాజు (తాడినాడ బాబు) శనివారం తెలిపారు. మన భవిష్యత్తు కోసం రానున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై రాజకీయ విశ్లేషకులతో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి టిడిపి, జనసేన, బిజెపి, సిపిఎం జిల్లా అధ్య క్షులు, ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్‌ఎలు, ఇన్‌ఛార్జులతో పా టు నరసాపురం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్య పార్టీల నేతలు హాజరవుతారని తెలిపారు.


లాజర్‌ను వైసిపిలోకి ఆహ్వానిస్తున్న పివిఎల్

వైసిపిలోకి లాజర్

ప్రజాశక్తి - పాలకోడేరు

టిడిపి పాలకోడేరు మండల నాయకులు, మాల మహానాడు జిల్లా నాయకులు కొండేటి లాజర్ శనివారం వైసిపిలోకి చేరారు. లాజర్‌కు డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కుముదవల్లి గ్రామానికి చెందిన కొండేటి లాజర్ గత కొంతకాలంగా మాలమహానాడు నాయకులుగా కీలకంగా వ్యవహరిస్తూ టిడిపిలో కొనసాగుతున్నారు. లాజర్‌తో పాటు మరికొంతమంది విస్సాకోడేరు గ్రామానికి చెందిన వైసిపి ముఖ్య నేత పిన్నమరాజు పృథ్విరాజు, రాష్ట్ర ప్రభుత్వ బిసి కార్పొరేషన్ డైరెక్టర్ బంధన పూర్ణచంద్రరావు, సర్పంచుల ఛాంబర్ మండలాధ్యక్షులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ రానున్నది జగనన్న ప్రభుత్వమేనన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ దేవరాయల జయంతి


విగ్రహానికి నివాళులర్పిస్తున్న గోపీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పరిపాలనతో పాటు సాహితీవేత్తలకు శ్రీకృష్ణ దేవరాయలు యుగం స్వర్గధామంగా ఉండేదని వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపీ చెప్పారు. శ్రీ కృష్ణ దేవరాయలు 553వ జయంతి సందర్భంగా పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఆయన విగ్రహానికి గోపీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన తెలుగు భాషకు చేసిన కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ కాపు క్లబ్ గవర్నర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్, టిటిడి సభ్యులు మేకా శేషుబాబు, పట్టణ ప్రముఖులు యడ్ల తాతాజీ, గుణ్ణం నాగబాబు, యర్రంశెట్టి వెంకటరత్నం, అడబాల వెంకటరమణ, ముచ్చర్ల శ్రీరాం, జక్కంపూడి కుమార్, గాదె ఆంజనేయులు, పెనుమాక రామ్మోహన్ పాల్గొన్నారు.

మోహనరావు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఆకివీడు

మృతదేహంపై పార్టీ జెండా కప్పుతున్న గోపాలన్

ప్రజానాట్యమండలి సభ్యులు, డప్పు వాయిద్య కళాకారుడు కుంచాడ మోహనరావు మృతి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న మోహనరావు శనివారం మృతి చెందారు. మోహన్‌రావు మృతదేహాన్ని గోపాలన్ సందర్శించి పార్టీ జెండాను కప్పారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా రైస్ మిల్ కార్మికుడిగా పని చేస్తూ డప్పు వాయించే కళాకారుడిగా జిల్లా అంతటా ఆయన మంచి ప్రాచుర్యం పొందారన్నారు. పార్టీకి, ప్రజా సంఘాలకు చెందిన నాయకులు వాసుదేవరావు, కె.తవిటినాయుడు, కె.శంకర్, బి.రాంబాబు, పెంకి అప్పారావు, లింగాల బలరాం, బత్తిన అప్పారావు, గంట వెంకటరావు, బి.పార్వతి, బి.రవితేజ, బివి.వర్మ పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు వినియోగించుకోవాలని పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కె.ప్రియాంక అన్నారు. సిహెచ్.అగ్రహారంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి గ్రామ సర్పంచి చుక్క అప్పారావు అధ్యక్షత వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి ప్రారంభించిన అనంతరం డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్థానిక ప్రజలకు ఉచితంగా వైద్యం అందించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిగూడెం ఏరియా ఆసుపత్రి వైద్యులు ఎస్.నిహారిక, ఎంపిటిసి సభ్యులు వెంకటేశ్వరరావు, ఇన్‌ఛార్జి కార్యదర్శి రామారావు, ఆరోగ్య సహాయకులు నామాల రాజు, ఆశాలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జంతువులను ప్రేమిద్దామంటూ ర్యాలీ

భీమవరం రూరల్ : విద్యార్థి దశ నుంచి జంతువులను ప్రేమించి ఆదరించడం అలవర్చుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాఫర్ హుస్సేన్ అన్నారు. పిఎస్‌ఎం బాలికోన్నత పాఠశాల విద్యార్థులు జంతువులను ప్రేమిద్దాం.. మానవత్వం చాటుకుందాం అంటూ శనివారం ర్యాలీ నిర్వహించారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సత్యనారాయణ జంతువుల పరిరక్షణపై వివరించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ జంతు పరిరక్షణపై నాలుగు పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలను నిర్వహించామని, 30న బహుమతులు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధారాణి, వారణాసి రాధాకృష్ణ, పాల్గొన్నారు.

చిరంజీవికి పురస్కారం అభినందనీయం

ప్రజాశక్తి - నరసాపురం

చిరంజీవికి పద్మవిభూషన్ పురస్కారం రావడం అభినందనీయమని వైఎన్.కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైఎన్.కళాశాల పూర్వ విద్యార్థి చిరంజీవి తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రవేశించి ప్రతిభతో, కృషితో ఉత్తమ నటుడిగా, మెగాస్టార్‌గా ఎన్నో విజయాలు సాధించారన్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా గతంలో పద్మభూషణ్ పురస్కారాన్ని పొంది వైఎన్ కళాశాల పూర్వ విద్యార్థిగా కళాశాల కీర్తి ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేసి, భారత రెండో అత్యున్నత పౌర పురస్కారం పద్మవిభూషణ్ అందుకోబోతున్న మెగాస్టార్ డాక్టర్ చిరంజీవికి శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు చెప్పారు. చిరంజీవి కళాశాల పూర్వ విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే రిపబ్లిక్ డే పెరేడ్‌లో పాల్గొన్నారన్నారు. చిరంజీవి ఎంపీగా ఉండగా ఎంపీ లాడ్స్ నుంచి కళాశాలకు రూ.50 లక్షలు ఇచ్చారని, దానికి ఆయన పేరుపై ఒక బిల్డింగ్ కట్టామని తెలిపారు. గతేడాది హైదరాబాద్‌లో జరిగిన కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో వైఎన్.కళాశాల అభివృద్ధికి తన సొంత నిధులతో మరింత విరాళం ఇస్తానన్నారని తెలుపుతూ, కళాశాలకే కాకుండా పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలకు ఎన్నో విధాలుగా సహాయం అందించారన్నారు. పేరుపాలెం గ్రామాన్ని దత్తత తీసుకుని రూ.6 కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. కోవిడ్ సమయంలో వివిధ ప్రాంతాలకు ఆక్సిజన్ సిలిండర్స్ అందించి ఎంతోమంది ప్రాణాలను కాపాడారన్నారు.

ఘనంగా పివిఎల్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - కాళ్ల

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు పుట్టినరోజు వేడుకలను శనివారం పెదఅమిరంలో ఘనంగా నిర్వహించారు. ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు మండలాలతో పాటు భీమవరం పట్టణానికి చెందిన పలువురు వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యాంపు కార్యాలయంలో పివిఎల్.నరసింహరాజును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. వచ్చిన వారికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు (వాసు), ఎంపిపిలు పెన్మత్స శిరీష విశ్వనాథరాజు, భూపతిరాజు చంటిరాజు, ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, కటారి జయలక్ష్మి కేశవ పాల్గొన్నారు.

మిలటరీ మాధవరంలో 'జనసేన పల్లెపోరు'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని మాధవరం గ్రామంలో శనివారం నిర్వహించిన జనసేన పల్లెపోరు కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అభివృద్ధి శూన్యమన్నారు. నిడదవోలు మాధవరం బ్రిడ్జి కూలిపోతే ఇప్పటివరకు దాని ప్రత్యామ్నాయం లేదన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గ్రామాలాభివృద్ధికి కృషి చేసే విధంగా జనసేనను ఎన్నుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం మండలాధ్యక్షులు అడపా ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు గరగా విష్ణుప్రియ, జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా ఠాగూర్ శతజయంతి వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భారతరత్న అవార్డు గ్రహీత బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూర్ ఠాగూర్ శతజయంతి ఉత్సవాలు భీమవరం మెంటేవారితోటలో పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం భవనంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు మలువలస రఘుబాబు, భీమవరం డివిజన్ నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సంఘం అధ్యక్షులు ఎం.శ్రీమన్నారాయణ అధ్యక్షత వహించారు. నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సత్యనారాయణ, సిహెచ్. బంగారురావు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణ వృత్తి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదగటం, దేశంలోనే ప్రప్రథమంగా కుల గణన చేపట్టి ఒబిసి రిజర్వేషన్ల కోసం ఆనాడే గట్టిగా పోరాడిన మహానేత కర్పూర్ ఠాగూర్ అని చెప్పారు. ఆయనకు భారతరత్న అవార్డు ప్రదానం చేసిన భారత ప్రధాని నరేంద్రమోడీకి కృతజ్ఞతలు తెలిపారు. దక్షిణ భారతదేశంలోని నాదస్వర విద్వాన్‌గా పేరుపొందిన దాలిపర్తి పిచ్చహరి మనవరాలు హరికథ భగవతారని ఉమామహేశ్వరికి కూడా పద్మశ్రీ అవార్డు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి నాయీ బ్రాహ్మణ సంఘీయులు రుణపడి ఉంటారన్నారు. ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు మలువలస రాము, సిహెచ్.లెనిన్‌బాబు, దుర్గారావు, వేపాడ పెద్దిరాజు, తుంపాల వెంకట్రావు, పెదపూడి నాగేశ్వరరావు, శ్రీను, ప్రముఖ సంగీత విద్వాంసులు పైడిరాజు, మల్లువలస పెద్దిరాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక బాలికల హైస్కూలులో బాలికలకు తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొప్పిశెట్టి రమణయ్య ఆధ్వర్యంలో జోన్ చైర్‌పర్సన్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు సూచనలతో లయన్ లంకా శ్రీనివాస్ సహకారంతో కేన్సర్ రహిత శానిటరీ ప్యాడ్స్‌ను, డేటాల్ సబ్బులు అందించారు. డాక్టర్ కె.కమల ముఖ్య అతిథిగా విచ్చేసి పిల్లలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎంను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిక్కాల భ్రమరాంబికా, పడాల కావ్యరెడ్డి, రేణుక, మాధురి లియో అంబికా, ఇంద్రవాణి, అభయం లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఈ నెల 31వ తేదీన, ఫిబ్రవరి ఒకటో తేదీన భీమవరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎపిటిఎఫ్ పక్షాన ధర్నా నిర్వహించనున్నట్లు ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్, జిల్లా శాఖ అధ్యక్షులు పిఎస్‌వి.ప్రసాదరావు తెలిపారు. ఇరగవరం మండలంలో పలు గ్రామాల్లో పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 117 జిఒను రద్దు చేయాలని, 11వ పిఆర్‌సి బకాయిలను, కరువు భత్య బకాయిలను చెల్లించాలని, 12వ పిఆర్‌సికి సంబంధించి ఐఆర్‌ను ప్రకటించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్‌ను రూపొందించాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల పిఎఫ్ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.రాంబాబు, జాన్సన్, పెద్దిరాజు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ల సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - నరసాపురం

ఎలక్ట్రీషియన్ల సేవలు ఎనలేనివని కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఎలక్ట్రీషియన్స్ డే సందర్భంగా గౌరవ అధ్యక్షులు ఉంగరాల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. కొవ్వలి యతిరాజు రామ్మోహన్‌నాయుడును సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారు రావి రమేష్‌బాబు, అధ్యక్షులు కడిలి దొరబాబు, ఉపాధ్యక్షులు మోటూరి సుధాకర్, కార్యదర్శి కర్రి ప్రభాకర్, ట్రెజరర్ సింగంశెట్టి బాబ్జి, జాయింట్ ట్రెజరర్ వేంద్ర నాగరాజు పాల్గొన్నారు.

'వైసిపిది అవినీతి ప్రభుత్వం'

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

మోసపూరిత, అవినీతి వైసిపి ప్రభుత్వాన్ని పారద్రోలేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ అన్నారు. పెనుమంట్ర మండలం పెనుమంట్ర, గరువు గ్రామాల్లో ప్రజలను పితాని ఎన్నికల ప్రచారంలో భాగంగా కలిసి తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. తొలుత బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మార్క్‌లిస్ట్ పోయినది

ఏలూరు జిల్లా, నిడమర్రు మండలం, అడవికొలను, డోర్‌నెం.4-4 కి చెందిన **మాదాసు వెంకటేశ్వరరావు, S/o.పోతురాజు** అను నా యొక్క ఒరిజినల్ 10వ తరగతి మార్క్‌లిస్ట్ పడిపోయినది. ది.22-1-2024 తేదీన అడవికొలను నుండి గణపవరం జిరాక్స్ తీయించుటకు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో పడి పోయినది. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కి తెలియజేయగలరు.

మాదాసు వెంకటేశ్వరరావు, S/o.మాదాసు పోతురాజు
శ్రీ సుబ్బారాయుడు టెంపుల్, అడవికోలను,
నిడమర్రు మండలం, ఏలూరు జిల్లా.
సెల్: 9963666956

పాస్ పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం ఆచంట వేమవరం లింగరాజు చెరువు గట్టు డోర్ నెంబర్ 9-3, కి చెందిన **కోళ్ళ శ్రీనివాసరావు, తండ్రి వెంకటనారాయణ** కు చెందిన నా యొక్క ఒరిజినల్ పాస్ పోర్ట్ పోయినది. పాస్ పోర్ట్ నెంబర్. **F 6497287** నెంబర్ గల ఒరిజినల్ పాస్ పోర్టును **24-01-2024** తేదీన ఆచంట వేమవరం నుంచి జిరాక్స్ నిమిత్తం మోటార్ సైకిల్ పై వెళ్తుండగా మార్గ మధ్యలో నా ఒరిజినల్ పాస్ పోర్టు పోయినది. కావున ఎవరికైనా దొరికితే ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

కోళ్ళ శ్రీనివాసరావు, తండ్రి వెంకటనారాయణ,
డోర్ నెంబర్ : 9-33, లింగరాజు చెరువు గట్టు, ఆచంట
వేమవరం, ఆచంట మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
పిన్ నెంబర్ 534272. సెల్ నెంబర్ 9949134241.

ప్రకటన

In the Court of the II Addl. Junior Civil Judge of Nuzvid
O.S.No.372/2020

Between:
Gogineni Narsa Kumai ..Plaintiffs
Versus
Potluri Nagarjuna Rao and 6 Others ...Defendants

పై నంబరు దావాలో పొట్లూరి శ్రీ హర్ష, S/o.నాగార్జునరావు, డో.నెం.83-1-77, జంగంగూడెం, నూజివీడు మండలం, ఏలూరు జిల్లా మరియు పొట్లూరి పవన శ్రీనివాస్, S/o.మధుబాబు, డో.నెం.83-1-77, జంగంగూడెం, నూజివీడు మండలం, ఏలూరు జిల్లా వారికి శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిపర్యాయములు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన జరుగుతున్నందున శ్రీకోర్టు వారి ఆర్డరు ప్రకారము ఈ పేపరు ప్రకటన ద్వారా వారికి **05-2-2024**వ తేదీన వాయిదా అయివున్నది. అని తెలయచేయుచున్నాము. పై తెలిపిన కోర్టు వారి యందు మీరు **05-2-2024**వ తేదీన ఉదయం 10.30 ని॥లకు హాజరు కాని పక్షములో శ్రీకోర్టు వారు తీసుకొనే చర్యలకు బాధ్యులు అగుదురు అని యిందుమూలంగా తెలియ చేయుచున్నాము.

నూజివీడు — కె.వి.రాఘవరావు
ది.27-1-2024 — అడ్వకేట్, విజయవాడ.

గ్రామపంచాయతి కార్యాలయము - వీరవాసరం

ROC.No.01/2024. — **తేది.27-01-2024**

టెండర్ నోటీసు

పశ్చిమ గోదావరి జిల్లా, వీరవాసరం మండలం, వీరవాసరం గ్రామపంచాయతీ కార్యాలయం పరిధిలో 2024-2025 ఆర్థిక సంవత్సరము నకు సంబంధించి ఒక సంవత్సరం కాలం పాటు అనగా **ది.01-04-2024వ తేది నుండి 31-03-2025వ** తేది వరకు ఈ క్రింద తెల్పిన ప్రజారోగ్య, మంచినీటి సరఫరా, వీధి లైట్లు నిర్వహణ, పనులు నిర్వహించుటకు గాను బహిరంగ టెండర్లు, **ది.03-02-2024** తేదిన గ్రామపంచాయతి కార్యాలయంలో **ఉదయం 11.00 గం.ల నుండి మధ్యాహ్నం 2.00 గం.ల వరకు** స్వీకరించబడి అదే రోజు **మధ్యాహ్నం 3.00 గం.లకు** హాజరు కాబడిన టెండర్‌దారుల సమక్షములో నాచే గాని లేదా నా అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు తెరువబడును. టెండర్లు దాఖలా చేయు వారు ముందు గా నిర్ణీత ధరావత్తు **రూ.250/-** చెల్లించవలెను. ధరావత్తు చెల్లించని టెండర్లు పరిగణన లోకి తీసుకొనబడవు. ఇతర విషయములు గ్రామపంచాయతీ కార్యాలయం పనిచేయు సమయము నందు తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

వ.నెం.	పని వివరం	వ్యక్తుల సంఖ్య	కాలము	ధరావత్తు ఒక్కొక్కరికి
1.	2024-2025 సం.నకు (01-04-2024 to 31-03-2025) వరకు పారిశుధ్య పనులు నిర్వహించుటకు.	16	ది.01-04-2024వ తేది నుండి 31-03-2025వ తేది వరకు	రూ.250/-
2.	2024-2025 సం.నకు (01-04-2024 to 31-03-2025) వరకు మంచినీటి సరఫరా పనికి	5	ది.01-04-2024వ తేది 31-03-2025వ తేది వరకు	రూ.250/-
3.	2024-2025 సం.నకు (01-04-2024 to 31-03-2025) వరకు వీధి దీపముల నిర్వహణ	1	ది.01-04-2024వ తేది 31-03-2025వ తేది వరకు	రూ.250/-
4.	2024-2025 సం.నకు (01-04-2024 to 31-03-2025) క్లీన్ ఆంధ్రప్రదేశ్ వెహికల్ డ్రైవర్‌గా పనిచేయుటకు	1	ది.01-04-2024వ తేది 31-03-2025వ తేది వరకు	రూ.250/-

సం/- పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ
వీరవాసరం, వీరవాసరం మండలం, ప.గో.జిల్లా.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
విలేకరులు కావలెను
మీరు జర్నలిస్టు కాదలచుకున్నారా?
మీకు సామాజిక స్పృహ ఉన్నదా?
విన్నదీ కన్నదీ పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంలో శిక్షణ, సామాజిక సమస్యలపై అవగాహన
-: విలేకరులు కావాల్సిన ప్రాంతాలు :-
జంగారెడ్డిగూడెం, నూజివీడు, ఏలూరు, పెదవేగి, పెదపాడు, దెందులూరు, కామవరపుకోట, లింగపాలెం, కె.ఆర్.పురం (బుట్టాయగూడెం), వేలేరుపాడు, నిడమర్రు, కైకలూరు, తాడేపల్లిగూడెం టౌన్, భీమవరం టౌన్, పెంటపాడు, అత్తిలి, ఇరగవరం, పెనుమంట్ర
యాడ్ ఎగ్జిక్యూటివ్: నూజివీడు. మార్కెటింగ్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
ఇంటర్వ్యూ : తేది: 30-01-24 మంగళవారం ఉదయం 10 గం॥ నుండి 12 గం॥ వరకు
ఇంటర్వ్యూ జరుగు ప్రదేశం: ప్రజాశక్తి కార్యాలయం, పవర్‌పేట, ఏలూరు
ఫోన్ నెం: 99493 66196, 89191 70815, 94900 99168